
# "సంభవామి యుగే యుగే"



ఇంకా సినిమా మొదలవలేదు. హాలు అప్పటికే నిండి పోయింది. కొంతమంది అసహనంగా ఈలలు వేస్తున్నారు.

తెర ముందరగావున్న సీట్లలో పక్కపక్కనే కూర్చున్నారు సింహాచలం, వరహాల్రాజు.

"ఏట్రా! ఇంతాలీసమేటి? ఈడింకా చినిమా మొదనెట్టడేం?" అన్నాడు సింహాచలం.

"నీకున్న దురద ఆడికి నేదు మరి. ఇసింటా నోరు మూసుకుని కూకో.... టయిమయితే ఆడే మొదనెడతాడు...." అన్నాడు వరహాల్రాజు, ఆడవాళ్ళ వేపు కూర్చుని తననే కన్నార్పకుండా చూస్తున్న అప్పలమ్మకో చిరునవ్వు పారేసి.

కొంచెం పైక్లాసు సీట్లలో కూర్చున్న గిరిజాల జుట్టు కొండలరావు అంటున్నాడు - "ఈ హాల్లో సీలింగ్ ఫాన్లు మొత్తం ముప్ఫయి ఆరున్నాయి. వాటిలో తిరుగుతున్నవి పన్నెండు మాత్రమే. ఆరాచకం పెరిగిపోవటం అంటే ఇదే"

పక్కనే కూర్చున్న సన్యాసిరావ్ పకపకా నవ్వాడు - "నువ్వు చెప్పిన లెఖ్ఖ ప్రకారం మన దేశంలో ఆరాచకం రెండు వంతులు పెరిగింది. అంటే ఒక వంతు బాగానే వుందన్నమాట. దాన్నే లైట్ ఎట్ ది ఎండ్ ఆఫ్ ది టనెల్ అంటారు. కనుక మనకి బాగుపడే రోజులొస్తున్నాయి" అన్నాడు.

పైన బాల్కనీలో, పక్కనే కూర్చున్న రాధ మీదకు వంగుతూ అన్నాడు గోపాలం - "సినిమా మొదలుపెడితే నీకు కాస్త దగ్గరవచ్చుననుకుంటే వీడు టైముకి మొదలుపెట్టి చావటం లేదు".

చిలిపిగా నవ్వి, తల పైకెగరేసి అన్నది రాధ - "నాకు నువ్వు దగ్గరవటమేమిటి? మనిద్దరం అగ్ని సాక్షిగా కొత్తగా పెళ్ళి చేసుకున్న మొగుడూ పెళ్ళాలం"

"అవును మరిచిపోయాను సుమా! అయినా ఇదేమిటి నీకు తాళి కట్టిన భర్తను.... ఏ మాత్రం పతిభక్తి లేకుండా నన్ను నువ్వు అంటున్నావేమిటి" అన్నాడు గోపాలం రాధ కళ్ళల్లోకి లోతుగా చూస్తూ.

"మరి మూడు లక్షల కట్నం పెట్టి నిన్ను కొనుక్కోలేదూ.... అందుకని......" అన్నది రాధ, తన భుజం మీద వేసిన గోపాలం చేతిని సుతారాంగా కిందకు దించి.

"ఈ చినిమాలో ఈరో అంటే నాకు చానా యిట్టం. ఆడు బాదినట్టు ఇలన్ని ఇంకెవడూ బాదనేడు. పోయిన్నారెల్లామే ఏటా చినిమా? ఎర్రిముగుడూ బుల్లిపెల్లామా?" అడిగాడు సింహాచలం.

"ఏ ముగుడయితే నాకేటి.... ఈ ఈరోయేనా? అందునో ముప్పై గుంటగాళ్ళని సావబా దింది" అన్నాడు వరహాల్రాజు, ఆ సినిమాని గుర్తుతెచ్చుకుంటూ.

"ముప్పై మందితో ఆడు సేసింది పైటు కాదు... ఆడూ సోనాలీ బిందే ఆడిన డాన్సు..... రోడ్డు మద్దెన డాన్సు....."

"బిందేట్రా? ఏం బిందె?" అడిగాడు వరహాల్రాజు.

"సోనాలీ బిందె... అదే.... ఇందీ ఈరోయిను బిందెహె... దాన్తరవాతే గందా పైటింగు. కూరగాయల బండి.... కుండలు. గుర్తునేదా...." అంటున్నాడు సింహాచలం.

వరహాల్రాజు తననే చూడటం గమనించి తన జాకెట్టు లేని శరీరం మీద చీర నిండుగా కప్పుకుంది అప్పలమ్మ.

ఈలోగా లైట్లు ఆర్పేసి అడ్వర్‌టైజ్‌మెంట్లు మొదలు పెట్టారు.

"ఈ సినిమాలో పాటలూ మాటలూ మన గురూగారివే.... బూతు పాటలు రాయటంలో ఆయన్ని మించిన వాళ్ళు లేరు. ఆరేసుకోబోయి పారేసుకున్నాను.... నీ సిగ్గు ఎగ్గులెంత వరకూ - నీ చీరె జారు వరకూ... లాంటి పాటలు వీటి ముందు బలాదూర్ అనుకో....." అంటున్నాడు కొండల్రావు.

"ఆయన పాటలు రాయటంలో చేయి జారాడు....ట"

"కాలు జారటం విన్నాను కానీ... చేయి జారటం ఏమిటి?" అడిగాడు కొండల్రావు.

"అదేలే. ఆ మధ్య ఏదో పత్రికలో చదివాను. ఇకనించీ రెండర్థాల పాటలు రాయనని ఆయన ప్రతిజ్ఞ చేశాడుట" అన్నాడు సన్యాసిరావ్.

"అయితే మనకివాళ పెద్ద పండుగ. ఈ సినిమాలో పాటలూ మాటలూ అన్నీ ఒకే అర్థం.... సరసమైనవేనన్న మాట...." కుర్చీలో కొంచెం ముందుకు జరిగి అన్నాడు కొండల్రావు.

"రాధా....." అంటూ ఆమెను కొంచెం దగ్గరగా తీసుకుని తన్మయత్వంతో కళ్ళు మూసుకున్నాడు గోపాలం.

రాధ గలగలా నవ్వి "ఇదిగో గోపాళం.... సినిమా హాల్లో కళ్ళు మూసుక్కూర్చుంటే ఇరవై రూపాయలు దండగయి పోతాయి. కళ్ళు తెరిచి సినిమా చూడు!" అన్నది అతని బుగ్గని సున్నితంగా పిండుతూ.

"అబ్బ ముద్దిస్తావనుకుంటే గిల్లుతావేమిటి?" అన్నాడు గోపాలం ఆమెకి మరి కొంచెం దగ్గరగా జరుగుతూ.

సినిమా మొదలయింది. హీరోని ఊరేగిస్తున్నారు. అతను కారు దిగి ఎర్రటి కార్పెట్ మీద నడుస్తుంటే ఇద్దరు డాన్సర్లు పూలు చల్లుతూ పాట పాడుతున్నారు. అతని మిత్రులూ, అభిమానులూ, కాలేజ్ క్లాసుమేటులూ, అతనిచేత అంతకుముందు జన్మలో రక్షించబడినవాళ్ళూ, బడనివాళ్ళూ అందరూ అతని చుట్టూ నుంచుని చప్పట్లు కొడుతున్నారు.

హాల్లో ఈలలు దద్దరిల్లాయి. వరహాల్రాజు కూడా నోట్లో వేలు పెట్టుకుని పెద్ద సౌండ్‌తో ఈల కొట్టాడు.

సినిమాలో హీరో అది విన్నట్టున్నాడు. ఒక్కసారిగా డాన్స్ మొదలుపెట్టాడు. అతని మిత్రులూ, అభిమానులూ, కాలేజి క్లాసుమేటులూ, అతనిచేత అంతకు ముందు జన్మలో రక్షించబడినవాళ్ళూ, బడనివాళ్ళూ అందరూ గబగబా అంగారక గ్రహం మీది మనుష్యుల వేషాల్లోకి మారిపోయారు. జపనీస్ సంగీతానికి ఇంగ్లీషు మ్యూజిక్ కలిపి "జంబా పంబా జిడ్డు జందరీ, తుంబా మంబా బొడ్డు సుందరీ" అనే తెలుగు పాటకి తగ్గట్టుగా ఫ్రెంచ్ డాన్స్ చేస్తున్నారు.

దర్శక బ్రహ్మ సినిమా స్కోపు తెర నిండుగా చెమ్కీపొడి చల్లిన బొడ్డు సుందరి బొడ్డుని అందంగా చూపిస్తున్నాడు.

"జంబా పంబా జిడ్డు జందరీ అంటే ఏట్రా? ఇందీనా... అరవమా?" అడిగాడు సింహాచలం.

"నీకా మాత్తరం తెలీదేటి? అది తెలుగే... కాపోతే చినిమా తెలుగంతే...." అన్నాడు

వరహాల్రాజు.

"ఇంతకుముందు బట్టల్లేకుండా డాన్స్ చేయాలంటే జ్యోతిలక్ష్మీ, జయమాలినో చేసేవాళ్ళు. ఇప్పుడా వేరే ఖర్చు లేదుకదా. చక్కహా హీరోయిన్లే ఒళ్ళు దాచుకోకుండా అన్నీ చేసేస్తున్నారు" అన్నాడు కొండలరావు.

"నువ్విచ్చిన పన్నెండు రూపాయల్లో ఇది రెండు రూపాయల విలువైన డాన్స్. ఇంక మనకి బాకీ పది రూపాయలు మాత్రమే" అన్నాడు సన్యాసిరావు.

"ఇదేమిటండీ... ఈ పిచ్చి సినిమాకి తీసుకొచ్చారు" అన్నది రాధ తన ఒడిలోని గోపాలం చేతిని సుతిమెత్తగా నిమురుతూ.

గోపాలం హాచ్చెర్యం నటించి అన్నాడు - "ఇది పిచ్చి సినిమానా? ఈ దర్శక చంద్రుడికి ఎనిమిది నెమళ్ళూ, పది నందులూ వచ్చాయి... తెలుసా?"

"ఏమో.. ఎన్ని నందులూ... పందులూ వచ్చినా, నాకిలాటి సినిమాలు నచ్చవు....." అన్నది రాధ కోపం నటిస్తూ.

"అయితే ఒక పనిచేద్దాం... సినిమా చూట్టం మానేసి కబుర్లా..." అంటున్న గోపాలాన్ని గుర్రుగా చూసి, ముందు సీట్లో కూర్చున్న ముం.సీ. సీతారామయ్యగారు "హుష్!" అన్నారు. రావి కొండలరావు "సైలెన్స్" అన్నట్టుగా.

రాధ గోపాలం కేసి చిలిపిగా చూసి, తల పైకి ఎగరేసి నవ్వి తను కూడా "హుష్!" అన్నది.

సినిమాలో హీరోయిన్ కాలేజికి వెడుతున్నది. ఆస్థిపాస్తులు లేని బీదపిల్ల కనుక చాలీ చాలని బట్టలు కట్టుకున్నది. ఇప్పుడు భూగోళం మీద వున్నది కనుక అంగారకం డ్రస్సు విప్పేసి సిల్కు డ్రాయరూ శాటిన్ బ్రాల మీద, పావు గజం దేవతావస్త్రం మాత్రం చుట్టుకుని కాలేజికి నడిచి వెడుతున్నది.

సెన్సార్ వాళ్ళకి లంచాలిచ్చి, వాళ్ళు దాచమన్నవి దాచినట్టుగా దాచినందువల్ల దాగకుండా బయటికి కనపడుతున్న ఆ ముంబాయి సొంపుల ఒంపులు ఆ కాలేజి కుర్రవాళ్ళను ఆకర్షించాయి. ఆవిడ వెనకాల పదిమంది కుర్రాళ్ళు నోళ్ళు తెరుచుకుని వస్తున్నారు. వాళ్ళల్లో ఒక రౌడీ లాంటి నలభై ఏళ్ళ స్టూడెంటు కుర్రాడు ఏదో మలైషియన్ పాట కూడా మొదలుపెట్టాడు. పదిమంది స్టూడెంటు కుర్రాళ్ళూ డాన్స్ చేస్తున్నారు.

సింహాచలం ఈసారి రెండు వేళ్ళూ నోట్లో పెట్టుకుని స్టిరియో ఫోనిక్ సౌండ్‌లో ఈల కొట్టాడు.

చీకటిగా ఉండటం వల్ల వరహాల్రాజు అప్పలమ్మని చూడటం మానేసి బొడ్డుసుందరిని

చూస్తున్నాడు.

"ఈ సీను కింకో రెండు రూపాయలు కిట్టాయి గురూ, ఇక వీడి బాకీ ఎనిమిది రూపాయలు మాత్రమే" అన్నాడు సన్యాసిరావు.

"ష్! నన్ను డిస్టర్బ్ చేయకు" అన్నాడు కొండలరావ్ రెప్పలార్పకుండా సినిమా చూస్తూ.

కుర్రాళ్ళందరూ బీద బొడ్డుసుందరిని అల్లరి చేస్తున్నారు. బొ.సుం. గబగబా నడుస్తున్నది. వాళ్ళు వెంట బడ్డారు. వాళ్ళను చూసి ఆమె పరుగెత్తటం మొదలు పెట్టింది. ఆ రౌడీలు కూడా పెద్దగా ఉగాండా భాషలో ఏదో అరుస్తూ ఆ పిల్ల వెంట పడ్డారు. దర్శకుడు ఎగిరెగిరి పడుతున్న ఆమె ఛాతిని తెర నిండుగా చూపిస్తున్నాడు. అప్పటిదాకా స్పీడుగా పరుగెత్తుతూ అలిసిపోయిన బొ.సుం. భీతహరిణేక్షణిలా కళ్ళు అటూఇటూ తిప్పతూ, "రక్షించండి రక్షించండి" అని అరుస్తున్నది. అక్కడవున్న వందమంది జనాభా నవ్వుతూ చూస్తూ నుంచున్నారు. ఎవరూ ముందుకు వచ్చి ఆమెను కాపాడలేదు. ఆమె అరుపులకు రెండు కాకులు మాత్రం చెట్టు మీద నించి లేచి కావుకావు మంటూ ఎగిరిపోయాయి.

"చూశావా! ఆ సింబాలిజం. అందుకే ఈ దర్శకచంద్రుడంటే నాకిష్టం" అన్నాడు గోపాలం.

రాధ మాట్లాడలేదు. ఆడపిల్ల అసహాయంగా అరుస్తుంటే, సింబాలిజం అంటాడు ఇదే మొగుడమ్మా అనుకుంటున్నట్టుగా వుంది ఆమె ముఖం.

"ఇప్పుడు మన ఈరో పెచ్చచ్చుమయి ఆళ్ళని సితక బాత్తాడు సూడ్రా...." అన్నాడు సింహాచలం.

"బేగిరా ఈరో బేగిరా...." అంటున్నాడు వరహాల్రాజు.

అయినా హీరో రాలేదు. ఆ అమ్మాయిని ఇద్దరు రౌడీల్లాంటి కుర్రాళ్ళు పట్టుకుని బలవంత పెడుతున్నారు. అక్కడ మూగిన జనంలో ఒక్కరు కూడా ఆమె గోడును వినటం లేదు. సోద్యం చూస్తూ నుంచున్నారు.

"మన బడ్డింగ్ హీరో ఎక్కడ్రా సన్నాసీ.... బీరు తాగటానికి ఏదన్నా పబ్‌కి వెళ్ళాడా?" అంటున్నాడు కొండల్రావ్.

"వస్తాడు బాబూ వస్తాడు. హీరో రాకపోతే ఎలాగ" అంటున్నాడు సన్యాసిరావు.

"బుద్ధిలేకపోతే సరి, అంతమందీ చుట్టూ చేరి చూస్తున్నారు కానీ ఎవరూ కలగచేసుకోరేం?" అన్నది రాధ కోపంగా.

"కోప్పడకు మరి. హీరో వస్తాడు. ఆమెను రక్షిస్తాడు. వెంటనే మంచి పాట కూడా

వస్తుంది" అన్నాడు గోపాలం, రాధ చేతిని మృదువుగా నిమురుతూ.

"కనీసం బట్టలు సరిగ్గా కట్టుకునుంటే ఈ గొడవలో పడివుండేది కాదుకదా" అన్నది రాధ కొంచెం నొచ్చుకుంటూ.

"బట్టలకేం.... చక్కహా వున్నాయి... ఆ కుర్రాళ్ళే.... వెధవ చూపులూ వాళ్ళూనూ...." అన్నాడు గోపాలం ఆ పిల్ల సొగసుల వేపు వెధవ చూపులు చూస్తూ.

ఈలోగా పొట్టిగా లావుగా ఉన్న ఒక హాస్యనటుడు పోలీసు వేషంలో వచ్చాడక్కడికి. ఆ పిల్ల అతని దగ్గరకు వెళ్ళి "రక్షించండి రక్షించండి.." అని అరిచింది. ఈలోగా ఆ కుర్రాళ్ళు కూడా పోలీసు దగ్గరికి వెళ్ళి, ఆ పిల్లను వదిలేస్తే డబ్బులిస్తామని ఆశ పెట్టారు.

"నేను పోలీసులా కనపడుతున్నానని మీరు నాకు డబ్బు ఆశ చూపిస్తున్నారు. కానీ నేను నిజం పోలీసుని కాను. కనుక మీ పప్పులు నా దగ్గర ఉడకవు. ఆ పిల్లను వదిలేయండి. నాకు కోపం వచ్చిందంటే... ఆ సముద్రంలోకి తోసేస్తాను" అని పక్కనే వున్న మురిక్కాలవ చూపించి బెదిరించాడు.

"ఇదేట్రా చిమ్మాచలం ఇలాగయినాదేటీ" వరహాల్రాజు నీళ్ళుకారిపోయాడు.

"ఈరో రాకండానే ఆల్లెల్లి పోయారేటీ...." వాపోయాడు సింహాచలం.

"కట్టుకోటానికి బట్టలు కూడా లేని కాలేజి స్టూడెంటువి నిన్నెంత కష్టపెట్టారమ్మా! పద నా మోటారు సైకిల్ మీద నిన్ను మీ కాలేజీ దగ్గర దించుతాను" అని ఆ అమ్మాయిని మోటర్ సైకిల్ మీద ఎక్కించుకుని బయల్దేరాడు పొట్టి పోలీసు.

"పోలీసు ప్రజలకి సహాయం చేయటమేమిటి గురూ... ఈ కథేదో సరిగ్గా నడుస్తున్నట్టు లేదు. అసలు హీరో ఏడీ...." అడిగాడు సన్యాసిరావ్.

"వస్తాడు బాబూ... వస్తాడు... అప్పటిదాకా నన్ను మాత్రం వాయించకు" కసిరాడు కథ అర్థంకాని కొండల్రావు.

"నన్ను రక్షించినందుకు చాల థ్యాంక్స్ అన్నయ్యా" అన్నది ఆ బీద బొ.సుం.

అతను పెద్దగా నవ్వాడు. "అన్నయ్య అని అప్రాచ్యపు మాటలనకు. నేను నీకు అన్నయ్యానీ కాదు. నువ్వు నాకు చెల్లెలివీ కాదు. నేను దొంగ పోలీసుని. నువ్వు బొడ్డు సుందరివి. నిన్ను మా గూడేనికి తీసుకుపోయి, స్వర్గసుఖాలనుభవిస్తాను. ఎవడు రక్షిస్తాడో చూస్తాను" అంటూ మళ్ళీ పెద్దగా నవ్వాడు.

మోటర్ సైకిల్ ఇప్పుడు హైదరాబాదు దాటి కోవలం బీచ్ మీదుగా నల్లమలై అడవుల్లోకి

వచ్చింది. ఆ దొంగ పోలీసు మోటర్ సైకిల్ ఆపాడు.

అక్కడ చాలమంది కోయవాళ్ళ డ్రస్సులు వేసుకుని, డాన్స్ చేయటానికి సిద్ధంగా వున్నారు. అంతకుముందే ప్రజాసేవయే తమ కర్తవ్యమైన ఎపిఎస్సార్టీసీ వారి నాన్‌స్టాప్ బస్సులో బొ.సుం. తల్లిదండ్రులని తెచ్చినట్టున్నారు, వాళ్ళిద్దరినీ అక్కడ చెట్టుకి కట్టేశారు.

ఆ అమ్మాయి, పోలీసు, మోటర్ సైకిల్ దిగగానే పాట మొదలయింది.

"ఏట్రా.... ఈ ముంబాయి పిల్ల ఈ సొట్టగాడితో ఆడుతుందా...." హాచ్చెర్యపోయాడు వరహాల్రాజు.

అదివిన్న ఆ అమ్మాయి కళ్ళ ముందు రంగురంగుల చక్రాలు తిరిగాయి. దొంగపోలీసు హీరోలాగా మారిపోయాడు. వాళ్ళిద్దరితో పాటూ మొత్తం ఎనభై మంది డాన్స్ చేస్తున్నారు. వాళ్ళ డ్రస్సులు చూస్తే నిర్మాత ఎంత పొదుపుగా సినిమా తీస్తున్నాడో అర్థమవుతుంది.

"ఒక్కొక్క డాన్సరుకీ పది పైసలు చొప్పున లెఖ్ఖవేసినా, నీకు మిగిలిన ఎనిమిది రూపాయలూ కిడతాయి. కనుక మిగతా సినిమా ఉచితం" అన్నాడు సన్యాసిరావు లెఖ్ఖకట్టి.

మూడు వేళ్ళు నోట్లో పెట్టుకుని స్పెషల్ ఎఫెక్ట్స్‌తో ఈల వేస్తున్నాడు సింహాచలం.

ఈలోగా పాటయిపోయింది. పోలీసు ఆ పిల్ల తల్లిదండ్రులని కట్టేసిన చెట్టుకి మంట పెట్టాడు. వాళ్ళు బాధగా అరుస్తున్నారు.

మంగళగిరి తిరునాళ్ళకి వెడుతూ ఎద్దుబళ్ళల్లో వచ్చిన రెండు వందలమంది జనమూ, "రండి రండి సొద్యం చూద్దాం" అంటూ వచ్చి, ఆ వృద్ధ దంపతులు ఏడుస్తుంటే నిటారుగా నిలబడి సొద్యం చూస్తున్నారు.

దర్శకచంద్రుడు అరుస్తూ ఏడుస్తున్న ఆ పిల్ల అందచందాలను సినిమాస్కోప్‌తో తెర నిండుగా చూపిస్తున్నాడు.

కళ్ళు చిట్లించుకుని చూస్తున్న గోపాలంతో అన్నది రాధ - "ఏమిటి గోపాళం.... పక్కనే తాళి కట్టిన పెళ్ళాం వుందన్న భయం కూడా లేకుండా ఏమిటలా నోరు తెరుచుకు చూస్తున్నావ్' అన్నది రాధ.

"లేదు....లేదు...." అన్నాడు గోపాలం కుసింత కంగారుపడుతూ.

"ఎందుకు భయపడతావ్... ఆ పిల్ల చూపిస్తున్నది. నువ్వు చూస్తున్నావ్... అందులో తప్పేముంది..." నవ్వింది రాధ.

గోపాలం కొంచెం తేరుకుని అన్నాడు - "అన్నీ నువ్వే అంటున్నావ్. ఇందాకేమో అలా చూస్తున్నావేమిటీ అన్నావ్. ఇప్పుడేమో చూస్తే తప్పేమిటీ.. అంటున్నావ్... ఎలా నీతో...."

"తప్పు నీది కాదు... మన సినిమాలది. ప్రేక్షకులని దద్దమ్మలనుకుని, ఏ మాత్రం ఇంటెలిజన్స్ లేకుండా చెత్త సినిమాలు తీస్తున్న ఈ పిచ్చి వెధవలది..." అన్నది రాధ.

ముందు సీట్లో కూర్చున్న ముం.సీ. సీతారామయ్య గారు వెనక్కి తిరిగి "హుష్!" అన్నారు.

ఈసారి గోపాలం రాధ వేపు తిరిగి "హుష్!" అన్నాడు.

"మన హీరో ప్రత్యక్షమయి వాడ్నిప్పుడు చితక్కొడతాడు చూడు" అన్నాడు సన్యాసిరావ్.

అయినా హీరో రాలేదు.

ఆ పిల్ల అమ్మా నాన్నా స్పృహ తప్పి పడిపోయారు.

ఇంకా హీరో రాలేదు.

పొట్టిపోలీసు పెద్దగా అరుస్తున్నాడు - "ఎవర్రా మిమ్మల్ని కాపాడేది... రమ్మను చూద్దాం....' అని.

అక్కడవున్న రెండువందల ఎనభై ముగ్గురూ ఏమీ మాట్లాడకుండా, ఏమీ చెయ్యకుండా హీరో కోసం ఎదురు చూస్తున్నారు. పహిల్మానుల్లా కండలు పెంచిన ఇరవై ఆరుగురు పెద్దమనుష్యులు కూడా, తమ కండల్ని గర్వంగా చూసుకుంటూ హీరో కోసం చూస్తున్నారు.

అయినా హీరో రాలేదు.

"ఏట్రా ఏడీ ఈరో.... రాడే...." అన్నాడు సింహాచలం కోపంగా.

"ఈరో రాకపోతే పెజల్ని రచ్చించే దెవరు? ఆల్ల బతుకులేమయిపోవాల...." సణుగుతున్నాడు వరహాల్రాజు.

సినిమా చూస్తున్న అభిమానుల్ని నిరుత్సాహపరుస్తూ ఈ కథా రచయిత సినిమాని ఇక్కడితో ఆపేస్తున్నాడు.

నేను ఏ విషయం గురించి రాస్తున్నానో చెప్పి, మీ మేధస్సుని తక్కువగా అంచనా వేయటం నా కిష్టంలేదు. కాకపోతే, ఒక్క నిమిషం.... ఈ పుస్తకం మూసేసి... కళ్ళు మూసుకుని.... "నేను సైతం... నేను సైతం..." అని అనుకుందాం మనమందరం.

అప్పుడర్థమవుతుంది. ఈ కథా వస్తువు. ★

*(ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక: 2000)*